రోడ్డులే డంపింగ్ యార్డులు!



అక్కుపల్లి-చీపురపల్లి రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

వజ్రపుకొత్తూరు రూరల్: దేశానికి పల్లెలు పట్టుకొమ్మలు అంటారు. అలాంటి పల్లెలను స్వచ్ఛ పల్లెలుగా తీర్చిదిద్దలన్న లక్ష్యంతో ఏళ్ల తరబడి ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. అయితే అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో లక్ష్యాలు నీరుగారుతున్నాయి. ప్రజలు అరోగ్యంగా ఉండేందుకు, చెత్త నుంచి సిరులు పొందేందుకు ఉపాధి హామీ పథకం నిధులతో లక్షలాది రూపాయలతో గ్రామాల్లో చెత్త సేకరణ కేంద్రాల నిర్మాణం చేపట్టింది. అలాగే చెత్త సేకరించేందుకు గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లను నియమించింది. వజ్రపుకొత్తూరు మండలంలో 27 చెత్త సేకరణ కేంద్రాలను నిర్మించారు. వీటిలో 15 కేంద్రాల ద్వారా చెత్త సేకరణ జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ఆ పరిస్థితి లేదు. చెత్త సేకరణ కేంద్రాల నిర్వహణ ప్రభుత్వ అశయాలకు అనుగుణంగా లేకపోవడంతో పల్లెలో చెత్త చెదారం తాండవిస్తుంది. ప్రధానంగా గ్రామీణ రోడ్లపై చెత్తను వేస్తుండడంతో రోడ్లు డంపింగ్ యార్డుల తలపిస్తున్నాయి. పారిశుద్ధ్యం క్షీణిస్తుండడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి చెత్త సేకరణ కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి స్వచ్ఛ పల్లెలుగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.



చెత్తతో నిండిపోయిన గరుడబద్ర రోడ్డు

మూగ జీవాలు మృత్యువాత

మూగజీవాలు ఆహారం కోసం వెతుకుతూ రోడ్లపై పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తింటూ అనారోగ్యానికి గురవుతున్నాయి. ప్రధానంగా చెత్త కుప్పలపై పడి ఉన్న ప్లాస్టిక్ కవర్లను పశువులు తింటూ మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను వీధి కుక్కలు నోటితో లాక్కుంటూ ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండడంతో పారిశుద్ధ్యం క్షీణిస్తోంది.

చర్యలు చేపడుతున్నాం

మండలంలో ప్రస్తుతానికి 15 కేంద్రాల ద్వారా చెత్తను సేకరిస్తున్నాం. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలలో గ్రీన్ అంబాసిడర్లను నియమించి వారికి తగిన పారితోషకం అందిస్తున్నాం. అలాగే ప్రతీ పంచాయతీకి ప్రత్యేక నిధులు కేటాయించాం. కార్యదర్శులకు ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ గ్రామాలను స్వచ్ఛ పల్లెలుగా తీర్చిదిద్దడానికి తగు చర్యలు చేపడుతున్నాం.

– ఎస్.రమేష్ నాయుడు, ఎంపీడీవో, వజ్రపుకొత్తూరు

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు క్రిస్మస్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ ఐటీ వింగ్ జిల్లా ప్రెసిడెంట్ ప్రతి అన్వేష్, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్, పట్టణ అధికార ప్రతినిధి శిష్టు గోపి, మాజీ ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ మధు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

- వైఎస్సార్‌సీపీ డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షుడు వరుణ్



తిలక్‌ను సత్కరిస్తున్న చింతాడ వరుణ్

టెక్కలి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తీవ్రంగా కృషి చేస్తానని ఇటీవల నూతనంగా నియామకమైన ఆ పార్టీ డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతాడ వరుణ్ అన్నారు. మంగళవారం కోటబొమ్మాళి మండల నాయకులతో కలిసి టెక్కలిలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సన్మానించారు. కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు డి.వెంకట్రావు, నాయకులు ఎన్.సత్యరాజ్, అన్నెపు రామారావు, ఎస్.హేమసుందర్‌రాజు, బి.వెంకటరమణ, సత్తారు సత్యం, హెచ్.వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఫొటోగ్రాఫర్లకు శిక్షణ

టెక్కలి: టెక్కలి పరిధిలోని ఫొటోగ్రాఫర్ల అసోషియేషన్ ఆధ్వర్యంలో సోనీ కంపెనీ ప్రతినిధులు మంగళవారం ఒక్క రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఫొటో గ్రాఫర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగరాజు సలహా మేరకు ఫొటోగ్రాఫర్లకు శిక్షణ నిర్వహించినట్లు స్థానిక సభ్యులు తెలిపారు. ఫొటోలు, వీడియోలు తీసే క్రమంలో వివిధ రకాల మెలకువలపై శిక్షణ ఇచ్చారు.

రైతులను ఆదుకోవాలి

సోంపేట: ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంటను నష్టపోయామని.. ప్రభుత్వం ఆదుకోవాలని వ్యసాయాధికారులను రైతులు కోరారు. ఆవదాలవలస కృషి విజ్ఞానకేంద్రం సస్యరక్షణ నిపుణులు ఎస్.అనూష, స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు కె.జగన్మోహనరావు, మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి తదితరులు మామిడిపల్లి, బారువ, పలాసపురం, జింకిభద్ర గ్రామాల వరి పొలాలను మంగళవారం పరిశీలించారు.

పరేడ్ డ్రమ్స్ వితరణ

ఇచ్ఛాపురం రూరల్: మశాఖపురం గ్రామానికి చెందిన ఆశి సంతోష్‌కుమార్ రెడ్డి ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. వారం రోజుల క్రితం కెప్టెన్‌గా పదోన్నతి వచ్చిన సందర్భంగా తాను చదువుకున్న బిర్లంగి ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించాడు. ప్రార్థన, క్రీడల సమయంలో అవసరమైన పరేడ్ డ్రమ్స్‌ను వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు పి.వి.రమణ, విశ్రాంతి ఆర్మీ జవాన్ దేవేంద్రనాథ్ రౌళో పాల్గొన్నారు.

వేరుశనగ సాగుపై అవగాహన

నందిగాం: వేరుశనగ మొక్కలు చనిపోకుండా ఉండాలంటే బ్లెటాక్స్ మందును లీటర్‌నీటిలో మూడు గ్రాములు చొప్పున పిచికారీ చేయాలని వ్యవసాయ శాఖాధికారి పి.శ్రీకాంత్‌వర్మ తెలిపారు. బరిణిగాం, దేవాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేరుశనగ పంట సంరక్షణ, అధిక దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఇచ్ఛాపురం రూరల్: యాజమాన్య పద్ధతులతో పంటలను రక్షించుకోవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అనూష అన్నారు. వర్షాలకు ముంపునకు గురైన పంట పొలాలను మంగళవారం సందర్శించారు. వర్షానికి తడిసిన ధాన్యం, నిల్వ ఓవులకు ఉప్పు ద్రావణం పిచికారీ చేయడం వలన ప్రయోజనం ఉంటుందన్నారు.

11 మందిపై బైండోవర్ కేసులు

సోంపేట: నాటు సారా తయారీ, రవాణా, విక్రయించేవారిపై కఠిన చర్యలు ఉంటాయని తహసీల్దార్ బి.అప్పలస్వామి అన్నారు. ఇటీవల ఎక్సైజ్ దాడుల్లో పట్టుకున్న 11 మంది నిందితులను ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ సమక్షంలో హాజరుపరచగా.. వారిపై బైండోవర్ కేసులు మంగళవారం నమోదు చేశారు.

700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

మందస మండలం సవరమధ్య గ్రామంలో సారా తయారీకి సిద్ధం చేసిన 700 లీటర్ల బెల్లం ఊటను ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం ధ్వంసం చేసినట్లు సీఐ కె.బేబి తెలిపారు. అలాగే కంచిలి మండలం గోపికాళి గ్రామం వద్ద ద్విచక్ర వాహనంపై 30 లీటర్ల సారా తరలిస్తూ ఎ.ఎస్.పల్లి గ్రామానికి చెందిన తురక భీమారావు పరారైనట్లు పేర్కొన్నారు. వాహనాన్ని, సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో సోంపేట, కోటబొమ్మాళి ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారన్నారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పేరాడ తిలక్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్
- 27న నిరసన

టెక్కలి: అధికారంలోకి వస్తే ఎటువంటి చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు ఆరు నెలల్లో పేద, సామాన్య వర్గాలపై భారం మోపే విధంగా విద్యుత్ చార్జీలను పెంచేశారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 27న టెక్కలిలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. ఆరు నెలల కూటమి ప్రభుత్వ పాలనలో సుమారు 15 వేల కోట్ల రూపాయలు విద్యుత్ చార్జీల మోత మోగించారని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సైతం తుంగలో తొక్కి ప్రజలకు చార్జీల భారంతో నడ్డివిరిచారని మండిపడ్డారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ర్యాలీతో పాటు విద్యుత్ అధికారులకు వినతిపత్రాలను అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, విద్యుత్ వినియోగదారులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యులు పి.వసంతరెడ్డి, డి.వెంకట్రావు, నాయకులు ఎస్.సత్యం, కె.గోవిందరావు, ఎ.రామారావు, హెచ్.వెంకటేశ్వరరావు, ఎస్.హేమసుందర్‌రాజు, ఎన్.సత్యరాజ్, కె.రామయ్య, ఎం.నాగభూషణరావు, ఎ.రాహుల్, బి.కార్తీక్, ఎం.గణపతిరావు, ఎస్.భూషణరెడ్డి, పి.వీరవసంత్, బి.వెంకటరమణ పాల్గొన్నారు.

మండల వార్షిక బడ్జెట్ ఆమోదం



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీరాంమూర్తి

నందిగాం: నందిగాం మండల వార్షిక బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నడుపూరి శ్రీరాంమూర్తి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం మంగళవారం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్ ఆరంభ నిల్వగా 8,20,693 రూపాయిలకుగా, ఆదాయం 45 కోట్ల 4 లక్షల 93 వేల తొమ్మిది రూపాయిలుగా, వ్యయం 45 కోట్ల రెండు లక్షల 77 వేల 169 రూపాయిలుగా, మిగులుగా పది లక్షల 35 వేల తొమ్మిది వందల 79 రూపాయిలుగా సూచించారు. వీటిలో 15 శాతం షెడ్యూల్ కులాలకు, ఆరు శాతం షెడ్యూల్ తెగలకు, 15 శాతం మహిళా శిశు సంక్షేమానికి, 23 శాతం అభివృద్ధి పనులకు, 12 శాతం మంచినీరు, 15 శాతం కార్యాలయ నిర్వహణకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో టి.రాజారావు, మండల ఉపాధ్యక్షురాలు రేగల లక్ష్మీకాంతం, మండల ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు, సభ్యులు ఎర్ర చక్రవర్తి, ఎ.విమలమ్మ, సైలాడ లావన్న, విలాస రాణి, ఎల్.ధనరాజు ఉన్నారు.

కరెంటు చార్జీల పెంపు అదనపు భారమే

- జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు తదితరులు

కంచిలి: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కరెంటు చార్జీల పెంచడం వినియోగదారులపై అదనపు భారమేనని జెడ్పీ చైర్‌పర్సన్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 27న ఇచ్ఛాపురం నియోజకవర్గ కేంద్రంలో చేపట్టబోయే 'కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమెతోపాటు ఎమ్మెల్సీ నర్తు రామారావులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ను మంగళవారం సాయంత్రం కంచిలిలో ఆవిష్కరించారు. ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఆరోజున పార్టీ శ్రేణులు, ప్రజలతో సంయుక్తంగా విద్యుత్‌శాఖ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతి పత్రం ఇచ్చే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, నిమ్మన దాస్, కంచిలి జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, మాజీ ఎంపీపీ నర్తు చామంతి, మండల జేసీఎస్ అధ్యక్షుడు కొణపల సురేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, సర్పంచ్‌లు యారడి ఆనందరావు, గణప సింహాచలం, నేతలు మద్దు వెంకటరావు, పైల మోహనరావు, పైల లక్ష్మీనారాయణ, రంగాల శ్రీనివాసరావు, సునీల్ రాథోడ్, డొక్కరి భోగయ్య, గణప దుర్యోధన ఉన్నారు.

సంక్షిప్తంగా..

వరి పొలాలు పరిశీలన

కంచిలి: ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అనూష మండలంలోని బూరగాం, జాడుపూడి గ్రామాల్లో మంగళవారం పర్యటించి వర్షాలకు నీట మునిగిన వరిపైను పరిశీలించారు. నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.

మహాసభలకు తెప్పలకు ఆహ్వానం

కాశీబుగ్గ: ఈ నెల 28, 29 తేదీలలో విజయవాడ కె.బి.ఎస్.కళాశాల ఆవరణలో అమరజీవి పొట్టి శ్రీరాములు సభా ప్రాంగాణంలో జరగనున్న ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి ఆహ్వానం అందింది.

అయ్యప్పస్వామి ఆలయ ధర్మకర్త మృతి

ఇచ్ఛాపురం: పట్టణంలోని శ్రీపంచాయతన అయ్యప్పస్వామి ఆలయనిర్మాణ ధర్మకర్త దుర్గాగురుస్వామి (దుర్గాప్రసాద్ పట్నాయక్) గుండెపోటుతో మంగళవారం మృతిచెందారు.

ఇందిరా చౌక్‌కు పూర్వ వైభవం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఇందిరా చౌక్‌కు పూర్వవైభవం తీసుకొస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు చెప్పారు. జంట పట్టణాల విస్తరణలో ఇందిరమ్మ విగ్రహాన్ని తొలగించగా.. దాన్ని మళ్లీ ఏర్పాటు చేస్తామన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు సాయం

పలాస: జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమంలో భాగంగా పలాస మండలం రెంటికోట పీహెచ్‌సీ మంగళవారం బాధితులకు పునరావాస పరికరాలను అందజేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు సదుపాయం కల్పించాలి

టెక్కలి: రోడ్డు సదుపాయం కల్పించాలని టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో గల ఎన్‌టీఆర్ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు కాలనీలోని పలు వీధులకు చెందిన మహిళలు మంగళవారం నిరసన తెలియజేశారు.

మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కంచిలి: సరకులు కొనుగోళ్లలో జరిగే మోసాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని మండల వినియోగదారుల సంఘం అధ్యక్షుడు టి.ఘనశ్యామలరావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

నేడు కళాకారులకు పురస్కారాల ప్రదానం

పలాస: మాకన్నపల్లిలో బుధవారం ఉద్దానం ప్రాంతానికి చెందిన కవులకు, కళాకారులకు కుత్తుం తాతారావు స్మారక పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. ఈ విషయాన్ని ప్రజావాగ్గేయకారుడు, కవి కుత్తుం వినోద్ తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కవిటి: రాజపురం గ్రామానికి చెందిన ఎ.లవరాజు, పి.కృష్ణారావు, బి.యుగంధర్ ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబ సభ్యులను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పరామర్శించారు. ఎంపీటీసీ సభ్యుడ సనపల కృష్ణారావు ఉన్నారు.

ఆస్పత్రి సందర్శన

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్ అన్నారు. సామాజిక ఆస్పత్రిని మంగళవారం సందర్శించారు.

సక్రమంగా ధాన్యం కొనుగోలు

కవిటి: ధాన్యం కొనుగోళ్లను సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. కవిటి పీఏసీఎస్ కార్యాలయంలో వ్యవసాయ, సహకార శాఖల సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు 76 మంది రైతుల నుంచి 311.8 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. కవిటి, కపాసుకుద్ది, బెలగాం, బొరివంక రైతుసేవాకేంద్రాల పరిధిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు కంచిలి, సోంపేట మిల్లులకే ధాన్యాన్ని అమ్ముకునేందుకు అటాచ్ చేశారన్నారు. కానీ తాజాగా టెక్కలి, పలాస, మందస, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాల్లోని మిల్లులకు కూడా తాజాగా అటాచ్‌మెంట్ చేశారన్నారు. వ్యవసాయశాఖ అధికారి బడగల దుర్గాప్రసాద్, పీఏసీఎస్ సీఈవో వంజరాన జానకీరామయ్య ఉన్నారు.

డీలర్‌పై 6ఏ కేసు నమోదు

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు గ్రామ రేషన్ డిపో డీలర్ కదంబాల ఉమామహేశ్వరిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు పౌర సరఫాల ఉప తహశీల్దార్ మురళీకృష్ణ తెలిపారు. రేషన్ డిపోను మంగళవారం అకస్మిక తనిఖీలు చేశామన్నారు. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సరుకుల పంపిణీ, నిల్వలలో అవకతవకలు జరిగినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. రికార్డులలో ఉండాల్సిన లెక్కలకంటే 845 కిలోల బియ్యం, 34 పంచదార ప్యాకెట్లు తక్కువగా ఉన్నాయని అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు.

విద్యుత్ చార్జిల పెంపునకు వ్యతిరేకంగా 27న నిరసన

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెంచిన విద్యుత్ చార్జీలతో వినియోగదారులు అనేక అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. చార్జీల పెండును వ్యతిరేకిస్తూ ఈ నెల 27వ తేదీన టెక్కలి చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. విద్యుత్ చార్జీల విషయమై ఎన్నికల మునుపు చంద్రబాబు ఇచ్చిన హామీను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రకటనతో మోసపోయిన ప్రజల పక్షాన ఈ నిరసన చేపడుతున్నట్లు దువ్వాడ వెల్లడించారు.

శాంతియుతంగా వేడుకలు నిర్వహించుకోవాలి



టెక్కలి ఆర్డీవో కార్యాలయం ఆడిటోరియంలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

టెక్కలి: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా బుధవారం క్రైస్తవులంతా శాంతియుతంగా యేసు ఆరాధనలతో వేడుకలు నిర్వహించుకోవాలని టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఆడిటోరియంలో పాస్టర్లతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. టెక్కలి, కోటబొమ్మాళి తహసీల్దార్లు కె.దిలీప్‌చక్రవర్తి, ఆర్.అప్పలరాజు ఉన్నారు.

ఢిల్లీ పోస్టుమెన్‌గా ఎంపికైన వ్యక్తికి సత్కారం



తేనేశ్వరరావు సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: కాశీబుగ్గ సబ్‌పోస్టాఫీసు పరిధి నగరంపల్లి బీఓలో జీడీఎస్‌గా పనిచేస్తున్న బమ్మిడి తేనేశ్వరరావు ఢిల్లీ పోస్టుమెన్‌గా ఎంపిక అయ్యారు. దీంతో స్థానిక సిబ్బంది మంగళవారం వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ని సత్కరించారు. కాశీబుగ్గ పోస్ట్ మాస్టార్ జె.రాము, జీడీఎస్ జిల్లా యూనియన్ ప్రతినిధులు ఎన్.నందికేశ్వరరావు, పి.ప్రకాశరావు, దొరబాబు, రాము, సతీష్, మోహన్‌రావు ఉన్నారు.

ఆర్థిక సహాయం..



అమెరికాకు చెందిన వి ఫర్ నీడి అసోసియేషన్ వైద్య ఖర్చుల నిమిత్తం పలువురు నిరుపేద రోగులకు ఆర్థిక సహాయం మంగళవారం అందించారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న కోటబొమ్మాళి మండలం లఖందిడ్డి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని టి.విద్యావతికి రూ. 10వేలు, షుగర్ కారణంగా కుడికాలు కోల్పోయిన వల్లేవలస గ్రామానికి చెందిన అల్లం కోటి కుటుంబానికి రూ. 10 వేలు అందించారు. ఈ ఆర్థిక సహయాన్ని మనబడి అసోసియేషన్ సభ్యులు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మనబడి అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు మాస్టార్, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, పాకాల జగదేశ్ ఉన్నారు. – సంతబొమ్మాళి

వెంకటాచలంకు రాష్ట్ర కన్స్యూమర్ అవార్డు



వినియోగదారుల సంక్షేమానికి రెండు దశాబ్దాలుగా కృషిచేస్తున్న నందిగాం మండల వినియోగదారుల సంఘం అధ్యక్షుడు వెంకటాచలానికి గౌరవ దక్కింది. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వినియోగదారుల వ్యవహారాలు కమిషనర్ జి.వీరపాండ్యన్‌ల నుంచి ఉత్తమ కన్స్యూమర్ అవార్డును అందజేశారు. వెంకటాచలం రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య వైస్ చైర్మన్‌గా, జిల్లా వినియోదారుల క్లబ్బులు మాస్టర్ ట్రైనీగా రెండు సంవత్సరాగా వ్యవహరిస్తూ విద్యార్థులను చైతన్యపరుస్తూ పలు కార్యక్రమాలు చేస్తున్నారు. ఈయనకు అవార్డు లభించడంపై జిల్లా వినియోగదారుల సంఘాల సమైఖ్య అధ్యక్ష, కార్యదర్శులు బగాది రామ్మోహన్‌రావు, బమ్మిడి నరేంద్ర, పౌరసరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు హర్షం వ్యక్తం చేశారు. – నందిగాం

ప్రజాప్రతినిధులకు విలువ లేదా?

- అధికారులను ప్రశ్నించిన సభ్యులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్: రాజ్యాంగ పరంగా ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు కూటమి ప్రభుత్వంలో విలువ లేదా అని సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈదుపురం, కేశుపురం సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్, గుజ్జు ఢిల్లీరావులు మాట్లాడుతూ.. పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణంలో జెడ్పీ, మండల పరిషత్, పంచాయతీల తీర్మానం లేకుండా వెండర్స్ పేరిట కార్యకర్తలకు నిర్మాణ పనులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మండలంలో మినీ గోకులాలు ఎన్ని మంజూరయ్యాయి, ఎవరికి ఇచ్చారు అనే విషయం స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియకపోవడం దురదృష్టకరమని అన్నారు. టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు దక్కత ఏకాంబరి మాట్లాడుతూ.. మండలంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని, ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న సీసీ రోడ్లకు సంబంధించి అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. కనీసం రోడ్లకు వాటరింగ్ ఎక్కడా చేయలేదని, మృతి చెందిన వారి పేరున ఇప్పటికీ రేషన్ సరుకులు అందుతున్నాయని అన్నారు. తమ పంచాయతీలో ప్రతీ నెల 30 మంది లబ్ధిదారులకు రేషన్ సరుకులు ఇవ్వడం లేదని తేలుకుంచి సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి అన్నారు. వర్షం నుంచి ధాన్యం రక్షించుకునేందుకు మండలానికి 80 పరదాలు మాత్రమే ఇచ్చారని, దీనికి రూ.650 చొప్పున డిపాజిట్ చేసి తిరిగి పరదాలు తీసుకోవడం ప్రభుత్వానికి సరి కాదని సభ్యుడు గుజ్జు ఢిల్లీరావు అన్నారు. ఏపీఎం సనపల ప్రసాద్ డబ్బులు తీసుకొని ఇష్టానుసారంగా సీఏఫ్‌లను నియమించుకుంటున్నప్పటికీ ఉన్నతాధికారులు ఎందుకు మిన్నకుండిపోయారని సభ్యుడు మాసుపత్రి చక్రవర్తిరెడ్డి ప్రశ్నించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాభివృద్ధికి పాటుపడాలని ముఖ్యఅతిథి ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఎంపీడీఓ రామారావు పాల్గొన్నారు.

నిధుల పంపిణీపై క్షేత్రస్థాయి విచారణ



కవిటిలో చేపట్టిన సర్వేలో అధికారులు

కవిటి: ప్రత్యేక అవసరాల చిన్నారులకు భవితకేంద్రాల్లో అందిస్తున్న సేవలు, వారికి అందిస్తున్న ప్రభుత్వ ప్రోత్సాహకాల పంపిణీ పారదర్శకంగా జరిగిందా లేదా అనే అంశంపై అధికారులు మంగళవారం క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్షా అధికారుల ఆదేశాల మేరకు కవిటి ఎంఈవోలు ధనంజయమజ్జి, కె.చిట్టిబాబులు, సీఆర్‌ఎంటీలు కవిటిలో పలువురు లబ్ధిదారుల తల్లిదండ్రుల్ని కలిసి భవితకేంద్రాల నిర్వహణ తీరు, ప్రభుత్వం ద్వారా పిల్లలకు అందిస్తున్న సంక్షేమ పథకాల ఆర్థిక ప్రయోజనం సక్రమంగా అందిస్తున్నారా లేదా అనే విషయాలపై ఆరాతీశారు. మండలంలోని వివిధ పంచాయతీలకు ఇప్పటి వరకు విద్యా సంవత్సరంలో 84 మంది ప్రత్యేక అవసరాల విద్య బాలబాలికలకు రూ.2,17,000 నగదును అందించినట్టు ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు లమ్మత కృష్ణారావు తెలిపారు. ఐఈఆర్‌టీలు సనపల లక్ష్మీతనూజ, పొల్లాయి హేమారావు, బాగా తులసయ్య, ప్రధాన్ పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి



వజ్రపుకొత్తూరు రూరల్: విద్యుత్ దీపాల వెలుగులో దోకులపాడు ప్రార్థన మందిరం



ఇచ్ఛాపురం: చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్‌ట్రీ

ముందస్తు క్రిస్మస్ వేడుకలు మంగళవారం వివిధ చోట్ల ఘనంగా జరిగాయి. పాఠశాలలు, చర్చిల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. క్రిస్మస్ ప్రాధాన్యతను పిల్లలకు తెలియజేశారు. అనాథ పిల్లలకు క్రిస్మస్ విందును ఇచ్చారు. చర్చిలను విద్యుత్ దీపాలంతో అందంగా అలంకరించారు. – సాక్షి నెట్‌వర్క్



సోంపేటలో ఓ పాఠశాలలో క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు



ఇచ్ఛాపురం: ఆంధ్రబాప్టిస్ట్ చర్చిలో క్రీస్తుజన్మ వృత్తాంతం



కాశీబుగ్గ: పలాస మండలం రామకృష్ణాపురం సత్యసాయి విగ్రహం వద్ద క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు



కాశీబుగ్గ:కొత్తపేట ఆలిండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ వారిచే కోసంగిపురం కూడలిలోని లలితా చారిటబుల్ ట్రస్టు అనాథ ఆశ్రమం పిల్లలు, వృద్ధులకు క్రిస్మస్ విందు